www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 21 డిసెంబరు 2022
5
పశ్చిమ గోదావరి

పుంతలో ఆక్రమణలు తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మల్లిపూడి, సోమరాజు ఇల్లింద్రపర్రు సరిహద్దులో పుంతను కొంతమంది భూస్వాములు ఆక్రమించారని సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు ఆరోపించారు. మంగళవారం ఆ పుంతను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ గతంలో ఈ పుంత వరి నూర్పిళ్లకు చాలా ఉపయోగకరంగా ఉండేదని, ఇప్పుడు స్తంభాలు వేసి కంచె వేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆ పుంతలో ఆక్రమణలు తొలగించాలని, కొంతస్థలాన్ని పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు పి.నాగేశ్వరరావు, బత్తుల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం.. వర్రీ..!

ఇప్పటి వరకూ సగం ధాన్యమే కొనుగోలు

మాసూళ్లు పూర్తయినా కళ్లాల్లోనే పంట

తేమ శాతం పేరుతో మిల్లర్లు ముప్పతిప్పలు

సొమ్ము జమపై రైతుల్లో టెన్షన్

ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ రూ.94 కోట్లు జమ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు వరి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ మాసూళ్లు పూర్తయినా పండిన పంట ఇంకా సగం కళ్లాల్లోనే ఉంది. రెండు జిల్లాల్లోనూ ఇప్పటి వరకూ నిర్దేశించిన లక్ష్యంలో 60 శాతానికిలోపే ధాన్యం కొనుగోలు జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. దాదాపుగా ఇంకా సగం ధాన్యం కళ్లాల్లోనే ఉంది. తేమపేరుతో మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులతో రైతులు విసిగివేసారిపోతున్నారు. దీంతో ధాన్యం రైతులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. ఖరీఫ్‌లో రెండు జిల్లాలవ్యాప్తంగా దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఖరీఫ్ మాసూళ్లు ప్రారంభమైనప్పటి నుంచి ధాన్యం అమ్ముకునేందుకు రైతుల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. సంచులు దొరకక, లారీలు లేక, జట్టు అందుబాటులో లేక, యాప్‌లు పని చేయక రోజుకో సమస్య అన్నట్లు పరిస్థితి తయారైంది. ఖరీఫ్ మాసూళ్లు మొదలై దాదాపు 25 రోజులు దాటిపోయింది. ఏలూరు జిల్లాలో 3.80 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యమవ్వగా ఇప్పటి వరకూ 2.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలో 3.42 లక్షల టన్నుల ధాన్యం లక్ష్యం కాగా 60 శాతంలోపు ధాన్యం కొనుగోలు జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ దాదాపు ఇంకా సగం ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటికీ వేగంగా ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదు. ధాన్యం విక్రయించేందుకు అన్నదాత పడుతున్న అవస్థలు ఇప్పటికీ తీరలేదు.

తేమ పేరుతో మిల్లర్లు ముప్పతిప్పలు

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నూతన విధానం ప్రవేశపెట్టింది. ఈ విధానం చాలా బాగుందంటూ అధికారులు చెబుతున్న గొప్పలకు.. క్షేత్రస్థాయి పరిస్థితులకు సంబంధం లేదు. ధాన్యం ఆరబెట్టిన తర్వాత రైతుభరోసా కేంద్రం సిబ్బంది వచ్చి తేమశాతం పరిశీలిస్తున్నారు. 17 శాతానికి తక్కువగానే ఉందని నిర్ధారించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం లారీలో లోడు చేసి మిల్లు వద్దకు వెళ్లాక తేమశాతం ఎక్కువగా ఉందని మిల్లర్లు తిప్పి పంపుతున్నారు. లేకపోతే లారీలో అక్కడే నిలిపివేస్తున్నారు. దీంతో రైతులు వ్యవసాయ, పౌరసరఫరాల శాఖాధికారుల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోంది. చివరికి మిల్లర్లు నిర్దేశించిన తేమశాతం ప్రకారం ధర తగ్గించడం వంటివి చేసిన తర్వాతే ధాన్యం తీసుకుంటున్నారు. ఇప్పటికీ రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో తేమశాతం ఒకటి. అదేవిధంగా ఇక్కడ వేబ్రిడ్జిపై తూకం సరిపోయినా మిల్లుకు వెళ్లిన తర్వాత తూకం తగ్గిందని రైతుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులతో రైతులు సతమతమవుతుండగా నూతన విధానం చాలా బాగుందని రైతులు చెబుతున్నారు. నూతన విధానంలో రైతులకు పూర్తిస్థాయిలో ధర అందుతుందని గొప్పలు చెబుతున్నా గతంలోకంటే అదనంగా జట్టు బిల్లు, తూకంలో కోత, తేమశాతం పేరుతో కోత, లారీలకు ఇచ్చే మామూళ్లు అన్నీ చూస్తే రైతులు చాలా నష్టపోతున్నారు. నూతన విధానంపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా అధికారులు మాత్రం అంతా భేష్ అంటున్న తీరు విస్మయం కల్గిస్తోంది.

ధాన్యం సొమ్ముపై టెన్షన్

ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో సొమ్ము జమ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 43,845 మంది రైతుల నుంచి 2.05 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. మొత్తం రూ.420 కోట్లు ధాన్యం కొనుగోలు జరగ్గా ఇప్పటి వరకూ జమైన సొమ్ము రూ.94 కోట్లు మాత్రమే. పశ్చిమగోదావరి జిల్లాలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి ఉంది. మిగిలిన సొమ్ము సకాలంలో జమవుతుందా.. లేదా అనే టెన్షన్ రైతులను వెంటాడుతోంది. గతంలోనూ తొలుత సొమ్ము వెంటనే జమ చేయడం, తర్వాత నెలలు తరబడి ఇవ్వకపోవడం జరిగింది. ఈసారి అటువంటి పరిస్థితి పునరావృతమవుతుందేమోననే భయం రైతులను వెంటాడుతోంది. త్వరితగతిన సొమ్ము జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

మహాసభ విశిష్టత తెలిపేలా ప్రచారం

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరిగే సిఐటియు 16 రాష్ట్ర మహాసభ విశిష్టత ప్రతి కార్మికునికీ తెలిసేలా ప్రచారం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. పట్టణంలో సిఐటియు రాష్ట్ర మహాసభ జయప్రదం కోరుతూ వీధివీధినా మంగళవారం ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు అధ్యక్షత వహించగా గోపాలన్ మాట్లాడుతూ జనవరి రెండో తేదీన వేలాదిమందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభ జయప్రదానికి జిల్లా కేంద్రంలో అన్ని తరగతుల్లో ప్రతి కార్మికుని వద్దకు ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు వెయ్యి మంది నాయకులు ప్రతినిధులుగా హాజరవుతారన్నారు. మహాసభను జయప్రదం చేయాలని ప్రజానీకానికి పిలుపునిచ్చారు. పట్టణంలో ఇంటింటికీ ప్రచారం, మాస్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, సిఐటియు నాయకులు ఎస్.శిరీష్‌కుమార్, కె.కృష్ణ, డి.నాగు, నాగరాజు, కోదండం, డి.శ్రీరాములు, సాంబ పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

తణుకు రూరల్: సిఐటియు రాష్ట్ర మహాసభ సందర్భంగా భీమవరంలో జనవరి 2న జరిగే బహిరంగ సభలో ఉద్యోగ, కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక అమర వీరుల భవనంలో రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.అజయకుమారి, నేతలు నీలాపు ఆదినారాయణబాబు, వల్లూరి వెంకటేశ్వరరావు, టి.రామకృష్ణ, గార రంగారావు, బి.భారతి పాల్గొన్నారు.

భీమవరం రూరల్: సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వెంప, బేతపూడి గ్రామాల్లో కొబ్బరి ఒలుపు, దింపు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కొబ్బరి ఒలుపు, దింపు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్.ప్రసాద్, ఆడబల వెంకట్రావు, పాలపర్తి కర్నేలు, చిలకపాటి అశోక్, కత్తిమండ సతీష్, కె.నాగశ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి కల్యాణి

ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు రాష్ట్ర మహాసభ అందరినీ ఆకట్టుకునేలా శ్రామిక మహిళ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రామిక మహిళ (సిఐటియు) జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి తెలిపారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలు భీమవరంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో స్థానిక సిఐటియు కార్యాలయంలో శ్రామిక మహిళలతో కోలాట దళం శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.చైతన్యప్రసాద్, షేక్ వలీ శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, ఉద్యోగుల సమస్యలపై సిఐటియు అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. పనికి తగ్గ వేతన సాధన కోసం, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం నిరంతరం ఉద్యమిస్తోందని తెలిపారు. సిఐటియు ఏర్పడిన 52 ఏళ్ల తర్వాత మొట్టమొదటిసారిగా పశ్చిమగోదావరి జిల్లాలో రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా కార్మికులతో కోలాటం ప్రదర్శిస్తున్నామని చెప్పారు. భీమవరంలో రెండు రోజులుగా కోలాటం శిక్షణ శిబిరాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.జ్యోతి, కోశాధికారి లారెన్స్‌కుమారి, జిల్లా నాయకులు బేగం, లక్ష్మీ, విజయలక్ష్మి, శ్రీ వర్ధిని, వరలక్ష్మి, పూర్ణ, సత్య, పద్మ, పార్వతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

కోలాటం చేస్తున్న శ్రామిక మహిళలు

సుస్థిర అభివృద్ధి సాధనలో శాఖలు కీలకం

సిఎం సిఇఒ సమీర్‌శర్మ

భీమవరం : మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి సమీర్‌శర్మ

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, వ్యవసాయ శాఖల ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందని ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ సమీర్‌శర్మ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమీర్‌శర్మ మాట్లాడుతూ ప్రతి నెలా పిల్లలందరికీ వైద్య పరీక్షలు చేయాలని, ప్రతి రెండు నెలలకు ఒకసారి హిమోగ్లోబిన్ తగ్గకుండా పరీక్షించాలని ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని, గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పదో తరగతి పూర్తి చేసిన బాలికలు ఇంటర్‌లో చేరేలా చైతన్యపర్చాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లాలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ఎస్‌పి యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఎఎస్‌పి సుబ్బరాజు, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ దాసి రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శివదేవునిచిక్కాలలో వైద్య శిబిరం పరిశీలన

పాలకొల్లు రూరల్: శివదేవునిచిక్కాలలో ఆశ్రమ హాస్పిటల్, బివి.రాజు కళాశాల సహకారంతో శ్రీరాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి సిఎం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సమీర్ శర్మ మంగళవారం ప్రారంభించారు. శిబిరాన్ని పరిశీలించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ట్రస్టు ద్వారా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. అనంతరం పరీక్షలు చేయించుకునేందు వచ్చిన వారితో మాట్లాడారు. అలాగే శివదేవుని చిక్కాలలోని గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడకు వచ్చిన గర్భినులు, బాలింతలు, బాలికలతో ఆయన మాట్లాడారు. అనంతరం ఆర్‌బికె సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శివదేవునిచిక్కాలలో రికార్డులు పరిశీలిస్తున్న సమీర్‌శర్మ

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజారవాణా అధికారి వీరయ్య చౌదరి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లాలోని వెంకటేశ్వర స్వామి సప్త మహిమాన్విత క్షేత్రాలను ఒకే రోజు దర్శించుకునేలా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.వీరయ్య చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన ఛాంబర్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అప్పనపల్లి, అబ్బిరాజుపాలెం, కొడమంచిలి, అన్నవరప్పాడు, వాడపల్లి, ద్వారకాతిరుమల, కాళ్లకూరులోని వెంకన్న దర్శనార్థం ప్రయాణికుల కోసం ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిందన్నారు. ప్రత్యేక బస్సుల్లో ఎటువంటి అదనపు ఛార్జీలు వసూలు చేయరని, సాధారణ ఛార్జీలతోనే బస్సులు నడుపుతారని తెలిపారు. వీటిని జనవరి ఆరో తేదీ నుంచి 14వ తేదీ వరకూ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం 17 బస్సులు, భీమవరం 32, నరసాపురం 28, తణుకు 28 బస్సులు మొత్తం జిల్లా నుండి 105 బస్సులు నడపడం జరుగుతుందన్నారు. పండుగ తర్వాత తిరుగు ప్రయాణికుల కోసం 15వ తేదీ నుంచి 23 వరకూ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. తాడేపల్లిగూడెం 9, భీమవరం 16, నరసాపురం 9, తణుకు 18 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సౌకర్యాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో భీమవరం డిపో మేనేజర్ వి.నరసింహమూర్తి, అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, షెడ్యూల్ సెల్ ఇన్‌ఛార్జి ఆర్.బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలి

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

జిల్లా ఎస్‌పి రవిప్రకాష్‌కు వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి నాయకులపై దాడులు చేస్తున్న వైసిపి నేతలపై చర్యలు తీసుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి కోరారు. మంగళవారం టిడిపి నాయకులతో కలిసి జిల్లా ఎస్‌పి రవిప్రకాష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ టిడిపి వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక వైసిపి నాయకులు దాడులు చేస్తూ తిరిగి కేసులు పెడుతున్నారని తెలిపారు. ఇందుకు మాచర్లలో జరిగిన సంఘటనే ఉదాహరణ అని, దాడులు చేసి ఆస్తినష్టం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక 40 మంది టిడిపి నాయకులను హత్య చేశారన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎద్దు ఏసుపాదం, గంటా త్రిమూర్తులు, కోళ్ల నాగబాబు, మైలాబత్తుల ఐజాక్ బాబు పాల్గొన్నారు.

అధ్యాపకులు లేకుండా కళాశాల ఏమిటీ?

టిడిపి నేత పితాని విమర్శ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండలం వల్లూరులో ప్రిన్సిపల్, లెక్చరర్లు లేకుండా మహిళా జూనియర్ కళాశాలను ప్రారంభించడం బాధాకరమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ధ్వజమెత్తారు. కేవలం జూనియర్ కళాశాల మాత్రమే ఏర్పాటు చేసి కొంతమంది విద్యార్థులను చేర్చుకున్నారన్నారు. ఆ విద్యార్థులకు వల్లూరు ఎంపీపాలెం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మహిళా జూనియర్ కళాశాలలో ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు. ఇదేమి ఖర్మరా కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం పితాని ఆ కళాశాలను సందర్శించి విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ కేవలం తొమ్మిది, పదవ తరగతులకు బోధించే ఉపాధ్యాయులతో కళాశాల విద్యాబోధన చేయడం ఎంతవరకు సమజసమని ప్రశ్నించారు. ఈ కళాశాలలో ఎంపిసి, బైపిసి గ్రూపులు ఏర్పాటు చేసినప్పటికీ కనీసం ప్రాక్టికల్స్‌కు సంబంధించి ల్యాబ్ కూడా లేదని, ఇలాగైతే విద్యార్థుల భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్‌కు గ్రామ సర్పంచి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమని, పైగా ఆ సమస్య పరిష్కారమైనట్లు చెబుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, నాయకులు కేతా మీరయ్య, బీర నరసింహమూర్తి, తమ్మినేడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సహజ ఫైబర్ ఉత్పత్తులపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

'విష్ణు ఉమెన్ టెక్నాలజీ పార్క్' ద్వారా "మహిళా పారిశ్రామికవేత్తల కోసం సహజ ఫైబర్ ఉత్పత్తులపై నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం తుది సమావేశం ప్రభావన మల్టీ స్టేట్ ఉమెన్స్ జ్యూట్ అండ్ అలైడ్ ప్రొడక్ట్స్ కోఆపరేటివ్ సొసైటీ హైదరాబాద్ సహకారంతో మంగళవారం నిర్వహించామని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసరావు తెలిపారు. విష్ణ టిబిఐ సిఇఒ డాక్టర్ ఎం.కె.కౌశిక్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు సహజమైన ఫైబర్ ఉత్పత్తులే అత్యుత్తమ ప్రత్యామ్నాయమన్నారు. శిక్షణ పొందిన మహిళా బందాన్ని 'ప్రభావన' సంస్థ ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్ గ్రూపుగా చేర్చనున్నట్లు విష్ణు ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ (వేదిక్) విద్యార్థి వ్యవహారాల డైరెక్టర్ మనీషా కృష్ణపుర్కర్ తెలిపారు. కలంకారి వస్త్ర ఉత్పత్తులపై మరిన్ని మహిళా గ్రూపులకు శిక్షణ ఇవ్వడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సిఇఒ డాక్టర్ భూపేష్‌కుమార్, శ్రీ విష్ణు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఒల నిరసన

ప్రజాశక్తి - ఆకివీడు

రానున్న 100 రోజుల్లో భూ సర్వే పూర్తి చేయాలని ఆదేశించడం పట్ల విఆర్‌ఒలు నిరసన వ్యక్తం చేశారు. ఈ రకంగా ప్రభుత్వం ఒత్తిడి చేయడం వల్ల విఆర్‌ఒలు మానసిక వేదనకు గురవుతున్నారని విఆర్‌ఒల అసోసియేషన్ మండల అధ్యక్షులు బంద హరిచంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఒలు కొద్దిసేపు నిరసన తెలియజేసి తహశ్శీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. భూ సమస్యలు ఎక్కువవుతుంటే వంద రోజుల్లో పరిశీలించాలనడం వేధింపులకు గురి చేయడమే అన్నారు. ఇక నుంచి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల విధులు నిర్వర్తిస్తామని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న విఆర్‌ఒ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకీ, అప్పారావు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఒల అసోయేషన్ సభ్యులు

ఆరోగ్యకర వాతావరణం అవసరం

మున్సిపల్ కమిషనర్ ఎన్.ప్రమోద్ కుమార్

ప్రజాశక్తి - పాలకొల్లు

మానవాళి మనుగడకు ఆరోగ్యకర వాతావరణం అవసరమని మున్సిపల్ కమిషనర్ ఎన్.ప్రమోద్ కుమార్ తెలిపారు. యూనిసెఫ్, సార్డ్స్ సంస్థల సౌజన్యంతో గ్రామోదయ ట్రస్ట్ ఏలూరు వారి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ హాల్లో నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత అంశాలపై ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులకు, పౌర సమాజ సభ్యులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. నీటిని మనమే కలుషితం చేసి, ఆ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నామన్నారు. నీటిని వృథా చేయకూడదని, నీటి ప్రాముఖ్యతను భావితరాలకు తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. వాటర్ వర్క్స్ ఇంజినీర్ సాంబశివుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ పట్టణంలో స్పెషల్ డ్రైవ్ ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. గ్రామోదయ ట్రస్ట్ ఛైర్మన్ చేకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు ఇంటి వద్దే తడి, పొడి చెత్తను విభజించాలన్నారు. యూనిసెఫ్ సంస్థ ప్రతినిధి చంద్రకళ మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామోదయ కోఆర్డినేటర్ జ్ఞానకుమార్, ఫెసిలిటేటర్, నాగమణి, మోప్మా ఆర్‌పిలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

నేటి నుంచి కోర్టుల్లో నియామకాలకు పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టులో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 21వ తేదీ బుధవారం నుంచి పెదతాడేపల్లి శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు తాడేపల్లిగూడెం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు పూర్తి పారదర్శకంగా, కంప్యూటర్‌పై నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ పరీక్షలు జనవరి రెండో తేదీ వరకు మూడు షిఫ్టుల్లో జరుగుతాయని తెలిపారు. పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయం కంటే 15 నిమిషాలు ముందుగా రావాలని సూచించారు.

ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న సిఐ సురేష్‌బాబు

శ్రీసూర్యలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో శ్రీ సూర్య డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ ఎ.సురేష్‌బాబు విచ్చేసి మాట్లాడారు. జీవితంలో అత్యున్నత స్థాయిని అధిరోహించాలంటే విద్యార్థి దశ నుండే ఆశించే భావంతో చదువు పట్ల శ్రద్ధ వహించాలన్నారు. సీనియర్ విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని, సెల్ ఫోన్‌ను చెడుకు ఉపయోగించుకోకుండా చదువు కోసం మాత్రమే ఉపయోగించి లక్ష్యాలను సాధించాలని తెలిపారు. విశిష్ట అతిథి ఏపిఎస్ఎస్‌డిసి ఎ.ప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. విద్యతోపాటు టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దువ్వూరు రామ్మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నప్పటి నుండే ఉద్యోగ ప్రయత్నం చేయాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మంతెనా బ్రహ్మాజీ మాట్లాడారు. మంచి ఉద్యోగాల్లో స్థిరపడి మన కళాశాలకు ముఖ్య అతిథులుగా రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మంతెనా సూర్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పులపర్తి పుల్లారావు, అకడమిక్ అడ్వైజర్ రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

ఎంఎల్ఎను కలిసిన ఛాంబర్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం స్థానిక పోడూరు మండలం తూర్పుపాలెం కార్యాలయంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వ్యాపారులు సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు కేతా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి రాంబాబు, కోశాధికారి నంబూరి విజయప్రసాద్, ఉపాధ్యక్షులు కంచర్ల శివ, వేంద్ర శ్రీనివాస్, నంబూరు విజయ్ పాల్గొన్నారు.

'పెనుగొండలో అభివృద్ధి శూన్యం'

ప్రజాశక్తి - పెనుగొండ

మేజర్ పంచాయతీ అయిన పెనుగొండలో అభివృద్ధి శూన్యమని, సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ప్రముఖ న్యాయవాది ఈదురుపల్లి రామానుజరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 30 రకాల సమస్యలను పెనుగొండ పంచాయతీ ఎదుర్కొంటోందన్నారు. అక్రమ లేఔట్లు, డ్రైనేజీ, ఇళ్ల నిర్మాణం, రోడ్లు తదితర సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా పైఅధికారులు స్పందించి పంచాయతీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఆచంటలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - ఆచంట

బడుగు బలహీన వర్గాల ఆశాకిరణం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎఎంసి చైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం వల్లూరులో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పేదలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వల్లూరు సొసైటీ చైర్మన్ నారిన వీర వెంకట సత్యనారాయణ, ఎంపిటిసి ఎడిద రామకృష్ణ, వైసిపి నాయకులు వర్దప్రసాద్, బొక్కా శ్రీను, పెన్మెట్స సత్యనారాయణ, పంది మాసేను, ఎడిద బాబు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అందరి ఆకలి తీర్చడమే టిడిపి లక్ష్యమని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) తెలిపారు. మంగళవారం స్థానిక అన్నా క్యాంటీన్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చే పార్టీ టిడిపి అన్నారు. ఏ ఒక్క పేదవాడూ ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో నాడు ఎన్‌టిఆర్ కిలో రెండు రూపాయలకే బియ్యాన్ని అందించారని, గత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నా క్యాంటీన్ ద్వారా ఐదు రూపాయలకే భోజనం ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం వైసిపి సర్కార్ అన్నా క్యాంటీన్లు ఎత్తివేసి పేదల కడుపు కొట్టిందన్నారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆశయ సాధన కోసం పని చేసే నాయకుడు చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, ఎలిజిబెత్ సతీష్, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ముప్పిడి రమేష్, శీలి వెంకటాచలం పాల్గొన్నారు.

15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాలకు హాజరు కావాలి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని కోర్టుల్లో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 21 నుంచి నిర్వహించనున్న పరీక్షకు గాను అభ్యర్థులు నిర్ణీత సమయానికి 15 నిమిషాలు ముందే ఆయా కేంద్రాలకు హాజరుకావాలని లేనిపక్షంలో వారిని కేంద్రంలోకి అనుమతించబోమని భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో వివిధ కేటగిరీ ఉద్యోగాల భర్తీకి ఆన్‌లైన్ విధానం ద్వారా గట్టి భద్రత నడుమ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు అందుకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

వృద్ధులు, వితంతువులకు సాయం

ప్రజాశక్తి - తణుకురూరల్

పేదలను ఆదుకోవాలని హోలీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు వర్దనపు వసంతరావు అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయం వద్ద ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది వితంతువులు, వృద్ధులకు దుప్పట్లు, పులిహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ఉండాలనే ఉద్దేశంతోనే ఆర్గనైజేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వర్దనపు విపుల్, తేతెలి రాము, సుమలత, సుసన్న ప్వెల్, రాజు పాల్గొన్నారు.

రచయిత్రి మహాలక్ష్మికి సత్కారం

ప్రజాశక్తి - పెనుగొండ

ములపర్రు గ్రామానికి చెందిన మహిళా రచయిత్రి గుండాల మహాలక్ష్మిని గ్రామానికి చెందిన ముస్లిం సంఘ పెద్దలు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా సయ్యద్ కరీంబాబా మాట్లాడుతూ వరల్డ్ రికార్డ్‌లో రచయిత్రిగా మహాలక్ష్మి పేరు నమోదుకావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆమె ఒక ఆణిముత్యం అన్నారు. అనంతరం మహాలక్ష్మి మాట్లాడారు. కవయిత్రి విభాగం నుంచి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 10 కవితలు ముద్రించబడ్డాయన్నారు. ఈ సత్కారం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు హాజి ఇబ్రహీం, మొహమ్మద్ హుస్సేన్, సయ్యద్ గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - తణుకు

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల భాగంగా తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ తణుకు సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం స్థానిక కార్యాలయంలో బహుమతులు అందజేశారు. దీనిలో భాగంగా ఈనెల 18వ తేదీన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ పొదుపు చేసుకోవడం వల్ల రాబోయే కాలంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నేటి సమాజంలో విద్యుత్తు నిత్యావసర వినియోగంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఇ సిహెచ్ రామకృష్ణ, ఏఇలు, జెఇలు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజా నాయకుడు జగన్ : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు అంటే రాష్ట్ర ప్రజలకు పండగ అని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 21న సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం బైపాస్ రోడ్డులో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా నాయకుడు, పేదల పాలిట పెన్నిధి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. మహిళలకు పలు పోటీలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిసి చైర్మన్ కనుమూరు సుబ్బరాజు (రాజాబాబు), జిల్లా ఫారెస్ట్ అధికారి హిమ శైలజ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షేక్ ఫిరోజ్, భీమవరం ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహ రాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : జగనన్న పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిగూడెంలో భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఈ నెల 21న సిఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టనున్న సేవా కార్యక్రమాలను ఆయన సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ వేడుకల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. మొక్కలు నాటడం, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పుట్టినరోజు వేడుకల ఏర్పాట్లను ఎంఎల్ఎ తనయుడు కొట్టు విశాల్ మంగళవారం పరిశీలించారు. నాలుగు లైన్ల రహదారిగా విస్తరించిన నల్లజర్ల రోడ్డులో మొక్కలు నాటే ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బొడ్డు సాయిబాబా, వెల్నాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుమంట్ర: పొలమూరులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సిఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో 500 మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం బహుజన కులాల నాయకుడైన చింతపల్లి గురుప్రసాద్ ప్రతినెలా వచ్చిన పెన్షన్ డబ్బులు దాచి ఆ డబ్బులతో 100 దుప్పట్లు, పండ్లు కొని వారి నివాసం వద్ద ఎంఎల్ఏ శ్రీ శ్రీరంగనాథ రాజు చేతుల మీదుగా పేదలకు పంపిణీ చేశారు. బుద్ధుడు, మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

ఉండిలో మొక్కలు నాటుతున్న పివిఎల్ నరసింహరాజు

కాళ్ల: ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు సందర్భంగా కాళ్ల హైస్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిపి పెన్మత్స శిరీష విశ్వనాథ్, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ రాంబాబు, రుద్రరాజు వెంకట రామకృష్ణంరాజు, కతారి లక్ష్మీపతిరాజు, కోపల్లె సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ వేగేశ్న జయరామ కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆచంట : విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం కోసం అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలను కోడేరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆచంటలో సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు పిచ్చెట్టి సత్యనారాయణ, దేవరపు సూర్యనారాయణ, మొల్లేటి రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకొల్లు: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈనెల 21న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మల సెంటర్లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం వైసిపి కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తారు. వృద్ధులకు పండ్లు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తారు.

ఉండి : ముఖ్యమంత్రి పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వైసిపి మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి రణస్థల కనకదుర్గ మహంకాళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగుతోందన్నారు. జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం నియోజకవర్గంలోని పేదలు, వృద్ధులకు సేవా కార్యక్రమాలు చేయడానికి నిశ్చయించుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉపసర్పంచి గొట్టుముక్కల కళ్యాణ వర్మ, గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జునరావు, చెరుకువాడ సర్పంచి కొండవీటి సాంబశివరావు పాల్గొన్నారు.

పెనుమంట్ర : జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూల్ ఆవరణలో ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు సహకారంతో ఆయన తనయుడు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి నరసింహరాజు, షర్మిలారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, నెగ్గిపూడి, వెలగలేరు సర్పంచులు పాల్గొన్నారు.

పాలకోడేరు : సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. విస్సాకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నరసింహరాజు ప్రారంభించి పాఠశాల ఆవరణలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), సర్పంచి బొల్ల శ్రీనివాస్, మాజీ సర్పంచి పెనుమత్స శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో వైసిపి నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు స్వర్ణలత, ఎంపిటిసి బొల్లం గాంధీ, నాయకులు కలిదిండి కృష్ణంరాజు, సామంతపుడి మారాజు, దుండి అశోక్‌బాబు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక త్యాగరాజు భవన్‌లో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తదానం, మహిళలకు పలు రకాల పోటీలను నిర్వహించేందుకు ఏరాట్లు చేశారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను మంగళవారం రాత్రి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

జనసేన మండల, గ్రామ కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి - కాళ్ల

జనసేన మండల కమిటీ, గ్రామ కమిటీల ఎన్నిక మంగళవారం నిర్వహించారు. కాళ్ల మండల అధ్యక్షులుగా ఏరుబండి రామాంజనేయులు, మండల ఉపాధ్యక్షులుగా ఓగిరాల రాజేష్, గడి రాము, ప్రధాన కార్యదర్శులుగా చవ్వాకుల వీరభద్రరావు, ఇర్రింకి జగన్, ఆరేటి దిలీప్, నిమ్మకాయల సాయికుమార్, కార్యదర్శులు యాళ్ల రవికుమార్, దేశంశెట్టి మధు, అరిటాకుల సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే మండలంలోని 21 గ్రామ కమిటీ అధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. జనసేన కాళ్ల గ్రామ అధ్యక్షులుగా బండారు సోమేశ్వరరావు, దొడ్డనపూడి గ్రామ అధ్యక్షులుగా కొల్లి పరశురామయ్య, సీసలి గ్రామ అధ్యక్షులుగా నూకల భోగేంద్ర బాబు, కాళ్లకూరు గ్రామ అధ్యక్షులుగా వంగపండు దుర్గాప్రసాద్, జువ్వలపాలెం అధ్యక్షులుగా బెవర నానిబాబు, ఏలూరుపాడు అధ్యక్షులుగా యాదాల వెంకన్న బాబు ఎన్నికయ్యారు. కొలనపల్లి అధ్యక్షులుగా యాళ్ల రాజేష్, గోగితిప్ప, మాలవానితిప్ప అధ్యక్షులుగా తిరుమాని మధుబాబు, ఆనందపురం మేకలదిబ్బ అధ్యక్షులుగా తిరుమాని అశోక్, జక్కరం అధ్యక్షులుగా బైలపాటి చిన్నయ్య, కోపల్లె అధ్యక్షులుగా లంకా సురేష్ ఎన్నికయ్యారు. బొండాడపేట గ్రామ అధ్యక్షులుగా ఇప్పుల లింగేశ్వరరావు, బొండాడ అధ్యక్షులుగా జడ్డు శ్రీను, వేంపాడు అధ్యక్షులుగా చుట్టూరి వెంకటేష్, ప్రాతాళ్లమెరక అధ్యక్షులుగా దిమ్మల బాలకృష్ణ, పల్లెపాలెం అధ్యక్షులుగా నాగిడి బాలాజీ, బొండాడలంక అధ్యక్షులుగా తానింకి నాగేశ్వరరావు, కోమటిగుంట అధ్యక్షులుగా పసుపులేటి మహేష్, ఎస్‌సి బోస్ కొలను అధ్యక్షులుగా పంచకర్ల రామసాయి, కలవపూడి అధ్యక్షులుగా అడబాల సురేష్, పెదమిరం అధ్యక్షులుగా కొడేటి జయరామ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన మండల, గ్రామ కమిటీ అధ్యక్షులను సత్కరించారు.


ఎన్నికైన జనసేన మండల, గ్రామ కమిటీ సభ్యులు

పితాని కాలనీకి సూర్యనారాయణరాజు పేరు పెడతా : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మహిళల అండదండలతో పితానికాలనీ పేరును కలిదిండి సూర్యనారాయణరాజుగా మార్పు చేస్తానని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం పొలమూరులోని పితాని కాలనీలో మూడో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో కొత్తపల్లి వెంకట సత్యనారాయణతో పాటు, స్థానికులు తమ వీధిలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని ఎంఎల్ఎను కోరారు. కాలనీలో ఆక్రమణలు తొలగిస్తే సాయంత్రంలోపు డ్రెయినేజీని నిర్మిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం డ్రెయినేజీ సౌకర్యం కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. కాలనీకి కలిదిండి సూర్యనారాయణరాజు పేరు పెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి), సర్పంచి కాకర రాజేశ్వరరావు, ఉప సర్పంచి కలిదిండి భాస్కర సత్యనారాయణరాజు (దినేష్‌రాజు), వైస్ ఎంపిపి వాసంశెట్టి కిరణ్ పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

రసాభాసగా మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. ఈ సమావేశంలో మండలంలోని పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు చర్చించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి అబ్దుల్ మాట్లాడుతూ దాళ్వాకు ఎంటియు 1121 రకం వంగడం అనువుగా ఉంటుందన్నారు. అలాగే సార్వాకు సంబంధించి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోపు సొమ్ము జమ చేస్తున్నామన్నారు. దిగమర్రు సర్పంచి రాపాక నగేష్ కరుణాకర్ మాట్లాడుతూ దిగమర్రు పంట కాలువలోకి పాలకొల్లు మున్సిపాల్టీ వ్యర్థాలు కలిసిపోతున్నాయని, ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ ఎప్పటికే 35 మందికి నోటీసులిచ్చామని, పాలకొల్లు మున్సిపాల్టీ వారి నుంచి స్పందన లేదని తెలియజేశారు. ఎండిఒ సంఘాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని తెలియజేశారు. ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి నడపన గోవిందరాజుల నాయుడు, వైస్ ఎంపిపి సునీల్, సర్పంచులు పాల్గొన్నారు.

పిహెచ్‌సికి వైద్య పరికరాలు, ఫర్నీచర్ అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సికి ఓఎన్‌జిసి భాగస్వామ్యంతో కమ్యూనిటీ సర్వీసెస్ రెస్పాన్స్‌బులిటీ వారు సుమారు రూ.3.60 లక్షల విలువచేసే వైద్య పరికరాలు, కుర్చీలు, కంప్యూటర్లు బహూకరించారు. ఈ సందర్భంగా ఓఎన్‌జిసి జనరల్ మేనేజర్ బిఎస్-ఎస్.మూర్తి మాట్లాడుతూ సంస్థ సమాజ సేవలో తానూ భాగస్వామ్యం అవుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యానికి ప్రాముఖ్యత ఇస్తున్నామన్నారు. భవిష్యత్తులో సంస్థ నుంచి మరిన్ని సేవలందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ సర్వీసెస్ రెస్పాన్స్ బిలిటి కోఆర్డినేటర్ వి.శ్రీనివాసు, వెంకటేష్, లంకలకోడేరు గ్రామ సర్పంచి చొప్పల రజనీ, దగ్గులూరు సర్పంచి విశ్వనాథం కనక భద్రం పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి ప్రభుత్వ హయాంలో అన్ని ధరలూ బాగా పెరిగిపోయాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం పట్టణంలోని 2వ వార్డులో మంగళవారం జరిగింది. ఎంఎల్ఎ నిమ్మల టిడిపి శ్రేణులతో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ ఇంటికి వెళ్లినా పెన్షన్ తీసేశారని, రేషన్ కార్డు, అమ్మఒడి తీసేశారని, కరెంటు ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయాని చెబుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. వైసిపి హయాంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు.

మార్టేరు వెంకన్న ఆలయంలో చోరీ

రూ.1.50 లక్షలు అపహరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు వెంకటేశ్వరస్వామి ఆలయ ఆఫీస్ రూమ్‌లో గుర్తుతెలియని వ్యక్తి రూ.1.50 లక్షలు దొంగిలించిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చేటు చేసుకుంది. ఈ మేరకు ఆలయ ఛైర్మన్ గొలగల చిన్నబాబు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం. మార్టేరు వెంకటేశ్వరస్వామి ఆలయానికి విజయ గోపాలచార్య పూజారిగా వ్యవహరిస్తున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో పూజారి ఆలయానికి వచ్చి మండపం లోపల సైకిల్ పెట్టాడు. ఆఫీసు రూమ్‌లో చప్పుడు కావడాన్ని గమనించిన పూజారీ అక్కడకు వెళ్లి చూసేసరికి అన్నీ బీరువాలో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. అప్పటికే గుర్తు తెలియని వ్యక్తి ఆలయ ఆఫీసు రూమ్‌లో బీరువాను పగలగొట్టి రూ.లక్షా 50 వేలను దొంగించి గుడి వెనకాల నుంచి పరారయ్యాడు. విషయాన్ని పూజారి ఆలయ ఛైర్మన్‌కు ఫోన్ చేసి చెప్పాడు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహారాజశ్రీ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ 2వ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, ఏలూరు

ఒ.ఎస్.నెం.338/2020

బిట్వీన్ :
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
బజారు బ్రాంచ్, ఏలూరు - వాది

గుమ్మడి లక్ష్మి వగైరా - ప్రతివాదులు

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన శ్రీమతి ఆనమ్ ఉష, భర్త : ఆనమ్ వెంకటేశ్వరరావు, డోరు నెం. 7సి-9-12, 7వ డివిజన్, తూర్పువీధి, ఏలూరు-1 వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారు 2వ ప్రతివాది అయిన మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా నోటీసులు అమలు జరుపుటకు ఆర్డరు వేసివున్నారు. పై దావా ది.5-1-2023 వ తేదీకి వాయిదా అయివున్నది. కావున మీరు ది.5-1-2023వ తేదీ ఉదయం గం.10-30 ని॥లకు పై కోర్టుకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల దావా మీ పరోక్షమున విచారింపబడును.

కర్లపాలెపు కళ్యాణి,
వాది తరపు అడ్వకేట్, ఏలూరు

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, TANUKU
O.S.550/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Tanuku ...Plaintiff
Vs
Vemula Durga Malleswari another ...Defendants

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1.వేముల దుర్గా మల్లేశ్వరి, W/o.చంద్రశేఖర్, హిందువు, స్త్రీ, 58 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2.కొండేటి రాణి, W/o.వినోద్, హిందువు, స్త్రీ, 44 సం॥లు, డో.నెం.22-4-12, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. ఏమనగా మీరు ది. 22-12-2022 తేదిన ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

N.Ravi Shankar
Advocate, Tanuku.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, TANUKU
O.S.370/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ...Plaintiff
Vs
Borra Subrahmanyam another ...Defendants

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1.బొర్రా సుబ్రహ్మణ్యం, S/o.మాధవరావు, హిందువు, పురుషుడు, 50 సం॥లు, BC Tank వీధి, పాలకొల్లు.
2.కట్టా మురళి, S/o.వెంకటేశ్వరరావు, హిందువు, పురుషుడు, 33 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. ఏమనగా మీరు ది. 22-12-2022 తేదిన ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

N.Ravi Shankar
Advocate, Tanuku.

ప్రకటన

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి, భీమవరం వారి కోర్టులో

O.S.No.49/2017

Between
సామంతపూడి శ్రీదుర్గా ...వాది
VS
దాట్ల వెంకట నరసింహ రాజు మరియు వగైరాలు ...ప్రతివాదులు

3వ ప్రతివాది: దాట్ల ధనుష్ వర్మ, S/o లేట్: సాయి కిషోర్, డోరు నెం:2-27, వెంప, భీమవరం మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు గ్రంథంలో 3వ ప్రతివాది అయిన దాట్ల ధనుష్ వర్మ గారికి అనేక పర్యాయములు శ్రీయుత కోర్టు వారి ద్వారాను మరియు రిజిస్టరు పోస్టు ద్వారాను సమన్లు పంపినను అందుకొనక కాలయాపన చేయుచున్నారని, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటనకు అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది:29-12-2022 తేదికి వాయిదా అయివున్నది. కావున 3వ ప్రతివాది అయిన దాట్ల ధనుష్ వర్మ గారు ది: 29-12-2022 తేదీన ఉదయం 10:30 ని॥లకు తమ అభ్యంతరములు స్వయంగా గాని, తమ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేని ఎడల సదరు గ్రంధమును 3వ ప్రతివాది అయిన దాట్ల ధనుష్ వర్మ గారి పరోక్షమున తీర్మానింపబడును అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

అల్లూరి వెంకటేశ్వర రాజు,
ప్రాంతం: భీమవరం. అడ్వకేట్, భీమవరం,
తేది: 13-12-2022 వాది తరపు అడ్వకేట్

ప్రకటన

మహారాజ శ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EA 357/2019 in EP 96/2012 in OS No.653/2002

బిట్వీన్ :
మార్నీడి సత్యన్నారాయణ, తండ్రి : లేటు కృష్ణమూర్తి, 5వ వార్డు, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా ...పిటీషనరు/DHR
1.గూడా రామ చంద్ర రావు, తండ్రి : రాజారావు, 13వ వార్డు, శివాలయం వీధి, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా Died
2 నుండి 5.... ...రెస్పాండెంట్/1st JDR
ప్రపోజెడ్ రెస్పాండెంట్స్/ప్రపోజ్‌డ్ JDRS
2. గూడా సావిత్రి, భర్త : లేటు రామచంద్ర రావు, 7వ వార్డు, పి & టీ కాలనీ, తాడేపల్లిగూడెం.
3. గూడా శ్రీనివాసరావు, తండ్రి : రామచంద్రరావు, 7వ వార్డు, పి & టి కాలనీ, తాడేపల్లిగూడెం.
4. గూడా ఈశ్వర రావు, తండ్రి : లేటు రామచంద్రరావు, 7వ వార్డు, పి & టీ కాలనీ, తాడేపల్లిగూడెం.
5. గూడా గంగ, తండ్రి : లేటు రామచంద్రరావు, 7వ వార్డు, పి & టి కాలనీ, తాడేపల్లిగూడెం...2 నుండి 5 రెస్పాండెంట్స్/2 నుండి 5 JDRS

పైన తెలియజేసిన మొదటి JDR గూడా రామచంద్రరావు గారు పైన ఉదహరించిన EP ప్రొసిడింగ్స్ పెండింగ్‌లో ఉండగా చనిపోయి నందున పైన తెలియజేసిన 2 నుండి 5 ప్రపోజుడ్ JDRS సదరు రామచంద్రరావుకు లీగల్ వారసులు అయినందున మిమ్ములను EP లో 2 నుండి 5 JDRS పార్టీలుగా ఇంప్లీడ్ చేయమని పిటీషనరు కోరియున్నందున మీరు ది.28-12-2022 సం॥ తేదీన ఉదయం 10.30 గంటలకు పైన తెలియజేసిన వారి కోర్టులో మీరు గాని, మీ తరుపున ప్లీడర్‌గారి హాజరై ఆక్షేపణలు ఏమైనా ఉంటే తెలుపవలెను లేని పక్షంలో మీ పరోక్షంలో కోర్టు వారిచే పరిష్కరించబడును కావున తెలియజేయడమైనది.

ఇట్లు
పండూరి రామం
పిటీషనరు/ DHR తరపు న్యాయవాది
ఫోన్ నెం. 73820 83577

తాడేపల్లిగూడెం
తేది : 20-12-2022

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, TANUKU
O.S.568/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Tanuku ...Plaintiff
Vs
Metla Jayalakshmi another ...Defendants

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1.మెట్ల జయలక్ష్మి, W/o.రామమూర్తి, హిందువు, స్త్రీ, 53 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2.వేముల సూర్యవంశీధర, S/o.చంద్రశేఖర్, హిందువు, పురుషుడు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. ఏమనగా మీరు ది. 23-12-2022 తేదిన ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

N.Ravi Shankar
Advocate, Tanuku.

IN THE COURT OF THE SENIOR Civil Judge. BHIMAVARAM
IPNO 18/2016

Petitioner:-
NANDYALA SURYANARAYANA
Respondents:-
KARRI SRINIVASA SOMU PRAKASH REDDY & others
21st Respondent:-
NIMMALA BALA BHASKARA RAO, S/o VENKATA RATNAM, DOOR NO 10-23/1, GRANDHI VARI STREET, Near: ELEPHANT TEMPLE , VEERAVASARAM village, mandalam, W.G.Dist.

పై నెంబర్ I.P లో 21వ రెస్పాండెంటుకు నోటీసులు అనేక పరియాయములు శ్రీ కోర్టు వారి ద్వారాను,రిజిస్టర్ పోస్ట్ ద్వారాను పంపించినను సదరు 21వ రెస్పాండెంటు అందుకొని ఉండటం లేదు కాబట్టి సదరు 21వ రెస్పాండెంటుకు నోటీస్ అమలు నిమిత్తం ది.03-01-2023 తేదీకి వాయిదా అయి ఉన్నది సదరు తేదీ ఉదయం 10 గంటల 30 నిమిషములకు స్వయముగాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియ పరచుకొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావా తీర్మానించబడునని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

భీమవరం
19-11-22

పిటిషనర్ తరుపు న్యాయవాది
DEGALA SRINIVASA RAO, B.Com.,B.L.,
ADVOCATE, GUNUPUDI. BHIMAVARAM
సెల్: 98482 12638